## వేంపల్లె లో 1100 గ్రాముల గంజాయి స్వాధీనం..

### ఇద్దరు నిందితులు అరెస్ట్ ..

**వేంపల్లె ఏప్రిల్ 20 (ప్రభాత వార్త)**

స్థానిక పట్టణంలో ఎస్పీ ఆదేశాల మేరకు, పులివెందుల డిఎస్పి బి. మురళి నాయక్ పర్యవేక్షణ లో, వేంపల్లి పోలీసుల ప్రత్యేక నిఘాతో గంజాయి సేవించి, విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను 20 న అరెస్టు చేశారు. వేంపల్లి టౌన్, పులివెందులరాయచోటి బైపాస్ రోడ్డులోని కవి మల్లేశ్వర స్వామి గుడి క్రాస్ రోడ్డు వద్ద దాడులు నిర్వహించి నల్లబెల్లి మల్లికార్జున (50)సం, యల్లంకూరు వెంకటేష్(52)సం వారి వద్ద నుండి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో వేంపల్లి ఇన్స్పెక్టర్ టి. నరసింహులు, ఎస్సైలు తాహిర్హుస్సేన్, తిరుపాల్నాయక్ పాల్గొన్నారు.




# వైఎస్ఆర్ కడప వార్త



తెలుగు జాతీయ దినపత్రిక

**మంగళవారం 21 ఏప్రిల్ 2026**


### పాలు పొంగాయని

## భార్యపై కోపంతో భర్త ఆత్మహత్య

**కడప ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

పాలు పొంగాయని భార్యపై కోపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడప తాలూకా ఠాణా పరిధిలో చోటు చేసుకుంది.తాలూకా ఎస్సై మహమ్మద్ రఫి వివరాల మేరకు.. కడప బాలాజీ నగర్కు చెందిన వెంకటసుబ్బయ్య (53), అనురాధ దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. వెంకటసుబ్బయ్య గతంలో గల్ఫ్ ఉండేవారు. ఇటీవల కడపకు వచ్చి దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రతి రోజు భార్యాభర్తలు చిన్న చిన్న విషయాలకు గొడవ పడుతుండేవారు. ఈనేపథ్యంలో ఆదివారం భార్య స్టవ్పై పాలు పెట్టడంతో అవి పొంగాయి. దీంతో భర్త నీకు ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం లేదంటూ కోపంతో తలను గోడకేసి కొట్టుకునే క్రమంలో చిన్నగాయమైంది. దీంతో భయపడి భార్య బయటికి వచ్చి కూర్చుంది. ఈ సమయంలో భర్త ఇంట్లో ఫ్యాన్కు ఉరేసుకున్నారు. ఆమె కొద్ది సేపటికి ఇంట్లోకి వెళ్లి చూడగా భర్త ఫ్యాన్కు వేలాడుతుండడంతో కేకలు వేశారు. చుట్టుపక్కల వారు వచ్చి వెంకటసుబ్బయ్యను ఉరి నుంచి కిందికి దించిన కొద్ది సేపటికే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి





**కడప, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా .నిధి మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభ భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ తో పాటు ఇంచార్జి డిఆర్ఓ వెంకట పతి,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు..అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

### చిన్నారుల భద్రతతో ఆటలు...

## ప్లే స్కూల్స్ మాయాజాలం

**చలానా కట్టి అనుమతుల డ్రామా**

**సర్వర్ సాకులు - అధికారుల మామూలు ఆరోపణలు**

**నియంత్రణ లేకుండా సాగుతున్న ప్లే స్కూల్స్ వ్యాపారం**

**ఎడ్యుకేషన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

కడప జిల్లాలో ప్లే స్కూల్స్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. చిన్నారుల భవిష్యత్తు పేరుతో ప్రారంభమైన ఈ సంస్థలు, నేడు పూర్తిగా డబ్బు దండుకునే కేంద్రాలుగా మారిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలకు వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా, కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పిల్లలకు అవసరమైన భద్రత, శుభ్రత, సరైన తరగతి గదులు, ఆడుకునే స్థలం వంటి ప్రాథమిక అవసరాలే అందుబాటులో లేవని స్పష్టమవుతోంది. పలుచోట్ల ప్లే స్కూల్స్ నిర్వాహకులు కేవలం చలానా కట్టడానికే పరిమితమై, పూర్తిస్థాయి అనుమతులు పొందినట్టుగా ప్రచారం చేస్తున్నారు. అధికారిక అనుమతులు లేకపోయినా, తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ "అన్నీ నిబంధనల ప్రకారమే నడుస్తున్నాయి" అని నమ్మిస్తున్నారు. ఏదైనా ప్రశ్నిస్తే, "ప్రభుత్వ నిబంధనలు క్లియర్గా లేవు", చలానా కట్టాలంటే సర్వర్లో ప్లే స్కూల్కు సంబంధించిన వెసులుబాటు లేదని పనిచేయడం లేదు" వంటి కారణాలు చూపుతూ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారు. దీంతో అసలు అనుమతుల వ్యవస్థపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్లక్ష్యం కారణంగా చిన్నారుల భద్రత పూర్తిగా గాలికి వదిలేసిన పరిస్థితి నెలకొంది. సీసీ కెమెరాలు లేని పాఠశాలలు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు లేకపోవడం, ఇరుకైన గదుల్లో చిన్నారులను ఉంచడం, శిక్షణ లేని టీచర్లతో బోధన, ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను వదిలిపెడుతున్న తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫీజులు మాత్రం భారీగా వసూలు చేస్తున్నారు. కానీ పిల్లల భద్రతపై ఎలాంటి హామీ లేదు. ఇది విద్య కాదు, వ్యాపారం" అని పలువురు తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అనుమతులు లేని ప్లే స్కూల్స్ను తక్షణమే మూసివేయాలి.ఫీజులపై నియంత్రణ విధించాలి. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. జిల్లా విద్యాశాఖ, మండల విద్యాధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోకపోతే, చిన్నారుల భవిష్యత్తుతో జరుగుతున్న ఈ దోపిడీ మరింత విస్తరించే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# అలుపెరగని రాజకీయ యోదుడు చంద్రబాబు

**: పేదల పెన్నిధి మన ముఖ్యమంత్రి**

**: దేశ రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక స్థానం**

**: రాష్ట్రాన్ని అబివృద్ధి పథంలో నడిపించడమే చంద్రబాబు ధ్యేయం**

**: బద్వేలు టీడీపీ ఇన్చార్జి రితేష్రెడ్డి**





**బద్వేలు ,ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**

ఎన్నికష్టాలు ఎదురైనా కాలంతో పోటీపడుతూ 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అహర్నిషలు ప్రజల సంక్షేమమేధ్యేయంగా అలుపెరగని పోరాటంచేస్తున్న గొప్ప రాజకీయ యోధుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని బద్వేలు టీడీపీ ఇన్చార్జి రితేష్రెడ్డి అన్నారు. టీడీపీ ఇన్చార్జి , సమన్వయకర్త రితేష్రెడ్డి ఆధ్వర్యంలో బద్వేలులో వైభవంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు పేరిట రితేష్రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్బివీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హాజరు కావడంతో భారీ కేక్ను కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆదినారాయణరెడ్డి, రితేష్రెడ్డి లు మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సవాల్ను ఎదుర్కొని కిందపడిన కెరటంలా ఎగిసిపడి రాజకీయాలను తన తెలివి తేటలతో నడిపిస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమమేధ్యేయంగా పనిచేస్తున్న గొప్పనాయకుడు దేశంలో ఉండడమే మన అదృష్టమని వారు అన్నారు. రేపటితరం భవిష్యత్తు కోసం చంద్రబాబు తపిస్తున్న విదానం ప్రజలను సంతోష పరిచేవిధం చూస్తుంటే ఎన్ని సంవత్సరాలు అయినా ఇలాంటి గొప్పనాయకుడు యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. తెలుగుజాతి గర్వించదగ్గ నేత చంద్రబాబు నాయుడు అని అయన జన్మదినం పురస్కరించుకుని తాము చేసేకార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడేలా చేస్తున్నందున ప్రతి కార్యకర్త పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. అమరావతి మన రాజధానిగా పేరు పొందాక నేటినుంచి కేవలం భావితరాలకు రాజధాని చూపించాలనే సంకల్పంతో చంద్రబాబు పడుతున్న తపన మాటలలో చెప్పలేనిదని దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా వారిపై ఉండాలని కోరుకుంటున్నామన్నారు. సంస్కరణల దిశగా సాగుతున్న ఆయన నాయకత్వం రాష్ట్రాబివృద్ధి కి గొప్ప శోధక శక్తిగా నిలుస్తుందని ప్రశంసించారు. దేశ ఆర్థిక ప్రగతిలో ఏపినీ కీలక భాగస్వామిగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి అభినందనీయమన్నారు. బద్వేలు పట్టణం కూడా హైవే రోడ్ల వలన పూర్తి అభివృద్ధి చెందుతుందని ప్రత్యేక నిదులు కేటాయించి ఈ ప్రాంతంలో అభివృద్ధిని చూడాలనే సంకల్పంతో ఉన్నారని రితేష్రెడ్డి ఆధ్వర్యంలో అబివృద్ధి చేసి చూపిస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జా రోశన్న, మార్కెట్యార్డుచైర్మన్ సుప్రజ, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్రెడ్డి, డైరెక్టర్ రంతు గోపాల్, ఎల్ఎస్పీ డ్యాము చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, చెముడూరు ప్రముఖ కాంట్రాక్టర్ ఈగ సుబ్బారెడ్డి, ఈగ సుమన్రెడ్డి, ఝాన్సీ, టీడీపీ నాయకులు సుదాకర్రెడ్డి, రవికుమార్రెడ్డి, జగదీశ్వర్రెడ్డి ,సీతా వెంకటసుబ్బయ్య, కనమర్లపూటి ప్రసాద్, శివయ్యస్వామి, నరసింహనాయుడు,జనసేన నాయకులు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు

**భారీ మెగా క్యాంపు :** ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్బీవీఆర్ ట్రస్ట్ , మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్చార్జి రితేష్రెడ్డి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎస్బీవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ మెగా క్యాంప్ను ఆదినారాయణరెడ్డి, రితేష్రెడ్డిలు ప్రారంభించారు. ప్రత్యేక నిపుణుల వైద్యబృందంతో గుండె, నరాలు, జీర్ణకోశ, క్యాన్సర్, కీళ్ల నొప్పులు, చెవి, ముక్కు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్లాంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న తర్వాత చికిత్స కోసం అవసరమైన వారికి ఎన్ టీఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు చేసేందుకు సిద్ధం చేశారు. బెంగుళూరుకు చెందిన వైదేహి హాస్పిటల్ వారి సహకారంతో ఈ మెగా క్యాంపు నిర్వహించినట్లు తెలిపరు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.





## పులపత్తూరు హత్య కేసులో నిందితుడు అరెస్ట్



మీడియాతో మాట్లాడుతున్న ఎ.ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే

**రాజంపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త**

రాజంపేట మండలం, పులపత్తూరు దిగువపల్లి గ్రామంలో పాత కక్షల కారణంగా జరిగిన దారుణ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు రాజంపేట ఎ.ఎస్పీ శ్రీ మనోజ్ రామనాథ్ హెగ్డే తెలిపారు. సోమవారం మన్నూరు సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో పులపత్తూరు దిగువపల్లి గ్రామంలో దంపెట్ల మల్లికార్జున అనే వ్యక్తిపై నిందితుడు గోబుగారి సుబ్బారెడ్డి పాత కక్షలు , వ్యక్తిగత కక్షల కారణంగా దారుణంగా బరువైన గుండు రాయితే దాడి చేసి హత్య చేశాడన్నారు.దర్యాప్తులో బయటపడిన విషయాల ప్రకారం, నిందితుడు, మృతుడు మల్లికార్జునలకి మధ్య గతంలో కుటుంబ, వ్యక్తిగత, సామాజిక విభేదాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా మృతుడి భార్యతో అనుచిత ప్రవర్తనకు ప్రయత్నించిన నిందితుడిని మృతుడు మల్లికార్జున ఎదిరించడం వల్ల ఇరువర్గాల మధ్య తీవ్ర గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ వివాదాలపై గతంలో మన్నూరు పోలీసు పోలీస్ స్టేషన్లో పరస్పర కేసులు నమోదు అయ్యాయన్నారు. నిందితుడు మృతుడిపై తీవ్ర కక్ష పెంచుకొని తరచూ బెదిరింపులకు పాల్పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో సంఘటనకు కొద్ది రోజుల ముందు నుంచే నిందితుడు మృతుడిని హత్య చేయాలనే ఉద్దేశ్యంతో అవకాశం కోసం ఎదురు చూసినట్లు వెల్లడైంది. 15 రాత్రి మద్యం సేవించిన నిందితుడు ముందుగా మృతుడితో గొడవపడి, అనంతరం మృతుడు ఒంటరిగా ఉన్న సమయాన్ని లక్ష్యంగా చేసుకొని, పులపత్తూరు దిగు వపల్లి, అంగన్వాడీ ప్రైమరీ పాఠశాల సమీపంలో అడ్డగించి పెద్ద గుండురాయితో తలపై బలంగా దాడి చేసి హత్య చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. దాడి తీవ్రత కారణంగా మృతుడు అక్కడికక్కడే మృతి చెందగా, నిందితుడు సంఘటన స్థలాన్ని విడిచిపెట్టి పరారయ్యాడు. తరువాతి రోజు తెల్లవారుజామున గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు. నిందితుడి కదలికలపై నిఘా వేస్తామని, కాపు కాసి పట్టుకుందామని, నిందితుడి ఒప్పుకోలు మేరకు, హత్యకు ఉపయోగించిన పెద్ద గుండురాయి సంఘటన స్థలంలో గుర్తించడం జరిగిందన్నారు. సంబంధిత పంచనామా నిర్వహించి, దాని ని సాక్ష్యంగా స్వాధీనం చేసుకున్నామన్నారు. విలేకర్ల సమావేశంలో మన్నూరు సీఐ లింగప్ప, ఎస్సై పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో రెండు అదనపు కోర్టులు ప్రారంభం

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు కోర్టు కాంప్లెక్సులో 2 నూతన కోర్టులను హైకోర్టు జడ్జీలు జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ బాలాజీ మేడమల్లి ప్రారంభించారు. సోమవారం నూతన కోర్టు సముదాయాల ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పుడున్న కోర్టులకు అదనంగా కొత్తగా 8వ అదనపు జిల్లా మరియు సెసెన్స్ కోర్టు, అడిషనల్ సివిల్ జడ్జీ కోర్టులను హైకోర్టు జస్టిస్ల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం 2 నూతన కోర్టుల్లో హైకోర్టు జస్టిస్లు, ఇతర న్యాయవాదులు ఆసీనులు కాగా బెంచ్లను నిర్వహించారు. పలు కేసులకు సంబంధించి వాదన జరిగింది. అనంతరం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు రెండు అదనపు కోర్టులు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి బార్ అసోసియేషన్లో సుమారు 70 మంది మహిళా న్యాయవాదులు ఉండడం గొప్ప విషయమన్నారు. మహిళా న్యాయవాదులందరూ న్యాయశాఖకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జస్టిస్ బాలాజీ మేడమల్లి మాట్లాడుతూ 2 అదనపు కోర్టులు ప్రారంభం కావడంతో పెండింగ్లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జీ డా.సి.యామిని మాట్లాడుతూ ప్రొద్దుటూరులో 2 అదనపు కోర్టుల ర్పాటుతో వేగవంతమైన కేసుల పరిష్కారం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ పేరుకుపోతున్న కేసులను త్వరితగతిన పరిష్కరించి సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో 2 నూతన కోర్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కోర్టుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏడీజే కె.సత్యకుమారి, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారుతీ ప్రసాద్రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



## నాణ్యమైన పరిశోధనలు రావాలి

**వైవీయూ,ఏప్రిల్ 21, ప్రభాతవార్త,:**

విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు నాణ్యమైనవిగా ఉండాలని ఇందులో ఎలాంటి రాజీ అక్కర్లేదని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల డీన్లు, 29 శాఖల అధిపతులతో ఆయన తన చాంబర్లో సోమవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి మాట్లాడుతూ వై వి యు అంటే నాణ్యత ప్రమాణాలకు పెట్టింది పేరుగా ఉందని అదే తీరు కొనసాగించాలని తెలిపారు. ప్రతి రీసెర్చ్ స్కాలర్ హాజరు తప్పనిసరి అని, స్వయం, ఎన్.పి.టి.ఇ.ఎల్ కోర్సు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. అలానే రీసెర్చ్ మెథడాలజీ క్లాసులకు హాజరు కావాలని, అలా కాని పక్షంలో పీహెచ్డీ రద్దుకు కూడా వెనుకాడవద్దని స్పష్టం చేశారు. పీహెచ్డీ పూర్తి చేసిన వారు బోధనా రంగంలోకి అడుగిడుతారు కాబట్టి వారికి బోధనా పద్ధతులు, బోధన విధానాలు, విద్య సాంకేతికత, ఎడ్యుకేషన్ ఫిలాసఫీ బోధించాల్సి ఉందని అందుకు తగ్గట్టు సిలబస్ ప్రిపేర్ చేయాలని రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగానికి, హెడ్ లకు సూచించారు. మే నెలలో ప్రారంభించే రీసెర్చ్ మెథడాలజీ తరగతులకు ప్రతి రీసెర్చ్ స్కాలర్ హాజరయ్యేలా చూడాలని తెలిపారు. రాసి కంటే వాసి ముఖ్యమని, నాణ్యత ప్రమాణాలే వై వి యూ కు బలమన్నారు. వేసవిలో కూడా విశ్వవిద్యాలయం లో పరిశోధనలు కొనసాగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రవేశాలు, నాణ్యమైన క్లాస్ రూమ్ టీచింగ్, సమయపాలన వంటి అంశాలపై చర్చించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. జనగణనలో భాగంగా కుటుంబం వివరాలను స్వయంగా నమోదు చేసుకొనే విధానంపై జనగణన మాస్టర్ ట్రైనర్లు ఆచార్య బాయినేని శ్రీనివాసులు, డాక్టర్ సుదర్శన్ రెడ్డి అవగాహన కల్పించారు.సమావేశంలో డీన్లు, హెచ్ ఓ డి లు పాల్గొన్నారు.



## ముందుచూపుతోనే రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

**పులివెందుల, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**



మీడియాతో మాట్లాడుతున్న బిటెక్ రవి

రాయలసీమ అభివృద్ధికి దూరదృష్టి కలిగిన నాయకత్వం అవసరమని, ఆ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపించిన విజన్ వల్లే ఈ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ హబ్గా మారిందని నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. సోమవారం గాంధీ సర్కిల్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసిన అనంతరం మీడియా తో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పునరుత్పాదక శక్తి ప్రాజెక్టులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, చక్రాయపేటలో 500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు, లింగాలలో విండ్ పవర్ యూనిట్లు, గండికోట వద్ద 2000 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఇందుకు నిదర్శనమని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి కీలకమని తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను కుప్పం వరకు తీసుకెళ్లి చెరువులను నింపడం ద్వారా రైతులకు ఊరట కలిగించడంలో చంద్రబాబు పాత్ర అపారమని అన్నారు. నీటి వనరుల సమర్థ వినియోగం వల్ల వ్యవసాయం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారా నికి తాము కట్టుబడి ఉన్నామని, వీధి స్థాయి సమస్యలైన డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్ల గుంతలు వంటి అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఒక ఫోన్ కాల్తో 24 గంటల్లోపు స్పందించే విధంగా బృందాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన బీటెక్ రవి, వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని పాలనలో అవినీతి పెరిగిందని ఆరోపిం చారు. పులివెందుల మున్సిపాలిటీలో పనులు చేయకుండానే కమిషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. అవినీతి వ్యవహారాలను త్వరలో బయటపెడతామని హెచ్చరించారు.అభివృద్ధి చేసే నాయకత్వం మరియు అవినీతి పాలన మధ్య తేడాను ప్రజలు గమనించా లని, వాస్తవాలను అర్థం చేసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇష్టం లేని గర్భాన్ని కొనసాగించుమని ఏ మహిళను కోర్టు వత్తిడి చేయదు

(సుప్రీం కోర్టు అనుమతితో కూడిన తీర్పు)

**బద్వేలు లీగల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**
ఇష్టం లేని గర్భాన్ని కొనసాగించుమని ఏ మహిళను, మరీ ముఖ్యంగా మైనరును న్యాయ స్థానం బలవంతం చేయజాలదని ఓ వ్యాజ్యములో సుప్రీం కోర్టు ఈ తీర్పును వెలువరించింది. మైనరుగా ఉన్నపుడు గర్భం దాల్చిన ఓ బాలిక 30 వారాల గర్భాన్ని వైద్య పరంగా తొలగించడానికి కూడా అనుమతినిచ్చింది. గర్భిణీ బాలిక పునరుత్పత్తి, స్వేచ్ఛకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రత్యేకించి ఆమె గర్భాన్ని కొనసాగించడానికి ఇష్టపడటం లేదని స్పష్టంగా తెలియజేసిన పరిస్థితులలో ఇది మరింత ముఖ్యం అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం నొక్కి వక్కాణించింది. న్యాయ స్థానం తన ఉత్తర్వుల్లో ఈ విధంగా పేర్కొంది. "మైనరు బాలికకు గర్భాన్ని కొనసాగించే విషయంలో వుండే హక్కును పరిగణన లోనికి తీసుకోవలసి ఉంది. ఇది చట్ట విరుద్ధమైనది. అని ఇట్లే అర్థమైపోతుంది, ఎందుకంటే ఆమె స్వయంగా మైనరు. ఒక సంబంధం వల్ల ఏర్పడిన దురదృష్టకర పరిస్థితి పర్యవసానంగా గర్భం దాల్చింది. ఆ సంబంధం ఇష్టపూర్వకమైనదా? లేదా? లైంగిక దాడి ఫలితమా? అనే విషయం ఇక్కడ ముఖ్యం కాదు" అని ధర్మాసనం స్పష్టం చేస్తూ అంతిమంగా వాస్తవం ఏమిటంటే "పుట్టబోయే బిడ్డ చట్టబద్ధమైనది కాదు, రెండవది ఆ బిడ్డను కనడానికి ఆమె ఇష్టపడటం లేదు. తల్లి ప్రయోజనాలను పరిగణన లోనికి తీసుకోవాలంటే ఆమె పునరుత్పత్తి స్వేచ్ఛకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలి, ఏ మహిళను, మరీ ముఖ్యంగా మైనరు బాలికను ఆమెకు ఇష్టం లేనపుడు గర్భాన్ని చివరి వరకూ కొనసాగించుమని న్యాయ స్థానం బలవంతం చేయజాలదు" అని ధర్మాసనం సుస్పష్టం చేసింది. పిటీషనరు అభ్యర్థనను అనుమతిస్తూ ముంబైలోని జెజె ఆసుపత్రి అన్ని అవసరమైన వైద్య జాగ్రత్తలు పాటిస్తూ మైనరు బాలిక గర్భాన్ని వైద్య పరంగా తొలగించాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న "ఇందులో ఇమిడియున్న క్లిష్టమైన నైతిక మరియు చట్ట పరమైన ప్రశ్నలను ప్రస్తావిస్తూ ఒక బిడ్డ జననం అంతిమంగా ఒక ప్రాణానికి దారి తీసినప్పటికీ ప్రస్తుత కేసులో గర్భాన్ని కొనసాగించడం ఇష్టం లేదని మైనరు స్పష్టంగా మరియు స్థిరంగా చెబుతూ ఉండటమే నిర్ణయాత్మక అంశం" అని వ్యాఖ్యానించారు. "ఇది మాకు కూడా కష్టమే, కానీ ఏం చేయాలి? మేము ఆమెను బిడ్డకు జన్మనివ్వమని బలవంతం చేయాలా? ఎందుకంటే పుట్టబోయే బిడ్డ కూడా అంతిమంగా ఒక ప్రాణమే. అపుడు మరో ప్రశ్న వస్తుంది. ఆమె 24 వారాలకే గర్భస్రావం చేయించుకోగలిగితే 30 వారాలకు ఎందుకు చేసుకోకూడదు? అంతిమంగా ఆమె బిడ్డకు జన్మనివ్వడానికి ఇష్టం లేదు, అదే ఇక్కడ ఉన్న ఇబ్బంది." అని జస్టిస్ నాగరత్న నొక్కి వక్కాణించారు. కాబట్టి ఇష్టం లేని గర్భాన్ని కొనసాగించుమని ఏ మహిళనూ న్యాయ స్థానం వత్తిడి చేయదు అంటూ మైనరు బాలిక 30 వారాల గర్భాన్ని తొలగించేందుకు అనుమతినిస్తూ జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. (శీర్షిక: నన తల్లి ఎదిరి మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎల్‌పి (సి) నెం.4774/2026)

## ఆంధ్రప్రదేశ్ ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**
రాష్ట్ర ఖురేషి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకులు, ఖురేషి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా బుచర్ ముఖ్యమంత్రి చంద్రబాబు 76 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆరిపుల్లా మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రగతి చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. సీఎం చంద్రబాబు అన్నింటినీ గాడిలో పెట్టి సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖురేషి సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు హైదర్ అలీ,తెలుగుదేశం నాయకులు శౌకత్ అలీ,సాయిల్, ఇక్బాల్,అష్రఫ్,సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే ఆదేశాలతో నూతన మోటర్ ఏర్పాటు



**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 20 ప్రభాతవార్త**
మండలంలోని రేకలకుంట పంచాయతీ డి.అగ్రహారం గ్రామంలో గత కొద్ది రోజులనుండి గ్రామంలో ప్రజల అవసరాలకు వినియోగించుకునే మోటార్ ప్రతిసారి మరమ్మత్తులకు గురవుతుండటంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో కడప జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల అవసరాల దృష్ట్యా వెంటనే దాని స్థానంలో కొత్త మోటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడంతో పాత మోటార్ స్థానంలో కొత్త మోటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. నీటి కోసం తాము పడుతున్న ఇబ్బందిని గ్రహించిన ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ మా గ్రామంలో నీటి సమస్య లేకుండా చేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గారికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు రామచంద్ర, పుటాల శివ యాదవ్, చెన్నకేశవరెడ్డి, సిద్దారెడ్డి, ఓబుళరెడ్డి, వెంకారెడ్డి, బ్రహ్మ రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వడ దెబ్బకు గురి కాకుండా చూచనలు



**సుండుపల్లె, ఏప్రిల్ 20,ప్రభాతవార్త :**
మండలంలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపరిధి లోని బండ కాడ ఈడిగపల్లిలో ఉపాధి కూలీలకు వడ దెబ్బ తగలకుండ తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేయడం జరిగిందని ఏంపిహెచ్ ఇఒఎన్. వీర నారాయణ తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మీకు దాహం వేయక పోయిన తగినంత నీరు తాగాలనియు,ప్రయాణిచేటపుడు మరియు బయటకు వెళ్ళేటపుడు నీళ్ల బాటిల్ తీసుకొని వెళ్ళాలనియు,ఒ ఆర్ ఎస్ ద్రావణం మరియు నిమ్మ రసం, మజ్జిగ, పండ్ల రసాలు తాగాలనియు, బయటకు వెళ్లే టపుడు వదులు గా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలనియు,బయట కు వెళ్లే టపుడు గొడుగు లేదా టవల్ టోపీ వాడవలెను మరియు తప్పనిసరిగా చెప్పులు వేసుకొని వెళ్ళవలెననియు,ఎక్కువగా బయట పనిచేసే వాళ్ళు వడ దెబ్బకు గురి అయ్యేఅవకాశం ఉంది కాబట్టి వడ దెబ్బ తగిలిన వ్యక్తి లో వికారం లేదా వాంతులు తల నొప్పి విపరీతంగా దాహం వేయడం వేగా వంతంగా శ్వాస మరియు గుండె కొట్టుకోవడం,శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీలు ఉండడం ఈ లక్షణలు ఉన్నవాళ్లను వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకొని వెళ్ళాలనియు, తరువాత ఉత్తమ వైద్యము కొరకు హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగాధర,ఎ ఎన్ ఎం మెహరన్ బీ, అమరావతి, ఆశా నాగరత్న పాల్గొన్నారు.

## శివాలయంలో పూజలు..

**సుండుపల్లి, ఏప్రిల్ 20,ప్రభాతవార్త:**
ఉపముఖ్యమంత్రి, జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా కోలుకుని కుదుటపడాలని ఆ పరమేశ్వరునికి భక్తి శ్రద్ధలతో పూజారులచే అర్చన కార్యక్రమం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించామని జనసేన నేత రామా శ్రీనివాస్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మచ్చా లక్ష్మీ నారాయణ, కృష్ణయ్య, శ్రీరాములు, వెంకట సుబ్బరాజు, సిద్దయ్య, ఋషేంద్రబాబు, నాగనిదిన్, శివప్రసాద్, నాగరాజ, జయరామ్ నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**సుండుపల్లె, ఏప్రిల్ 20,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు 76వ జన్మదినం సందర్భంగా చప్పిడి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం మరియు రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగావాసి. ప్రసాదబాబు కేకు కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారాని రాష్ట్ర కార్యదర్శి చప్పిడి. మహేష్ నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు చప్పిడి.రమేష్ నాయుడు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దాదాపు 550 మందికి ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ, అలాగే దాదాపు 2000 మందికి మంచి భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందనియు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాజమ్మ, నాయకులు ప్రజలు పాల్గొన్నారని తెలియజేసారు.

## బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీకి భారీ షాక్

**బద్వేలు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**
బద్వేల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కాశీనాయన మండలం, ఇటుకలపాడు పంచాయతీ పరిధిలోని ఇటుకలపాడు గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో సుమారు 50 కుటుంబాల వారు వైఎస్సారసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి స్వయంగా ఇటుకలపాడు గ్రామానికి విచ్చేసి, వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్ రితేష్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి విజన్ మరియు దార్శనికతను చూసి ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని గమనించిన ప్రజలు, నేడు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. ఇటుకలపాడు గ్రామంలో ఆదినారాయణ రెడ్డి బాలయ్య నాయుడు వీరితోపాటు ఒకేసారి 50 కుటుంబాలు పార్టీలోకి రావడం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలాన్ని నిరూపిస్తోందని, పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తను ఒక సైనికుడిలా కాపాడుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారంతా రాబోయే రోజుల్లో బద్వేల్ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం

**బద్వేలు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**
కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని ఎన్‌జీవో హోంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిలర్ మానుగుంట రవిశంకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ ముందుండి పనిచేస్తోందని తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించడం, పీఆర్సీ కమిటీ ఏర్పాటు, సి పీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, వేతనాల పెంపు వంటి పలు డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించారు. అలాగే సర్వ శిక్ష అభియాన్, కేజీబీవీ మోడల్ స్కూల్స్, గురుకులాల విలీనం, సిఆర్పి లకు ఉద్యోగ భద్రత, ఖాళీల భర్తీ, డి ఎ బకాయిల చెల్లింపు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కూరాకు రవీంద్ర, వెంకటరమణ, సుబ్బరాయుడు, మల్లికార్జున, నాగరాజు, ఆనంద్, , కూరాకు రవి, ఓ సూరి విజయ భాస్కర్ నంది మండ్నల విజయభాస్కర్ వెంకటేశ్వరరాజు, రమణారెడ్డి, కృష్ణయ్య, ఆనంద్ వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## భూదందాలను అనిచివేస్తున్న ప్రభుత్వం

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**
కడప నగరంలో జరిగిన దస్తగిరి హత్యోదంతం వెనుక వైకాపా నాయకుల కుట్రలు, భూదందాలే కారణమని స్పష్టమవుతోందనీ టిడపి జోనల్ కోఆర్డినేటర్ ఆర్. శ్రీనివాసుల రెడ్డి ఆరోపించారు. సోమవారం కడప ద్వారకా నగర్ లో తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో మొదలైన ఈ హత్యారాజకీయాలను, భూ కబ్జాలను బాబు ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తుందన్నారు. దస్తగిరి హత్య వెనుక ఎంతటి పెద్దలున్నా విడిచిపెట్టే ప్రసక్తి లేదు. దీనిపై సమగ్ర విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలవునున్నామని వెల్లడించారు. నగరంలో అరాచకాలకు తావులేదని, దోషులను కఠినంగా శిక్షించే వరకు వదిలిపెట్టమని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాము.



## సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకునే విలక్షణ నేత చంద్రబాబు

**రాజంపేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**
తెలుగు జాతి గర్వించదగ్గ విలక్షణ నేత ముఖ్యమంత్రి చంద్రబాబు అని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. విజన్ తన బ్రాండ్‌గా సృష్టించుకున్న అరుదైన ప్రజా నేత అని కొనియాడారు. చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జగన్మోహన్రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పేదలకు అన్నా క్యాంటీన్‌లో ఉచిత భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ విజినరీ నాయకుడు చంద్రబాబు అని,గత విధ్వంసకర వైసిపి పాలనలో వెనక్కు మరలిపోయిన వివిధ అంతర్జాతీయ కంపెనీలను మరల ఆంధ్ర రాష్ట్రానికి తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు చూపడంతో పాటు రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్ గా నిలబెడుతున్న ఘనత ముఖ్యమంత్రి దేనని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి చంద్రబాబు బర్త్ డే వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్ రాజు,రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సుధాకర్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పార్టీ పట్టణ, గ్రామీణ అధ్యక్షులు మణి, మేడికొండ రవికుమార్,డాక్టర్ నవీన్, టి సంజీవ రావు, శరత్ కుమార్ రాజు మన్నూరు సింగిల్ విండో చైర్మన్ ఎం సుబ్రహ్మణ్యం, వరదయ్య గారి పల్లె సర్పంచ్ హరి, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ళ చంద్రమోళి,తదితరులు పాల్గొన్నారు.



## ఇస్కాన్ ఆధ్వర్యంలో సమ్మర్ కల్చర్ క్యాంపు,

**మైదుకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
కడప జిల్లా మైదుకూరు మండలంలో ప్రొద్దుటూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో సమ్మర్ కల్చర్ క్యాంపు ఏర్పాటు చేయడమైనది. ప్రొద్దుటూరు ఇస్కాన్ ప్రచారకులు వసుమన వెంకటేష్ దాస్ మాట్లాడుతూ మైదుకూరు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థుల 5,6,7,8,9వ తరగతి గల బాల బాలికలకు మానవ జీవిత ప్రయాణంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించుటకు అతి సరళమైన శిక్షణ విధానము ఈనెల 25 నుండి మే 8వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, ధ్యానం (మంత్ర మెడిటేషన్), క్రీడలు (గేమ్స్), నృత్యం (డాన్స్) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక రుసుము 200 రూపాయలు నిర్ణయించారు. అంతే కాకుండా మే నెల 8వ తేదీన భగవద్గీత శ్లోకాలకు 25 మార్కులు, బహుళైచ్ఛిక ప్రశ్నలకు 25 మార్కులు, పరీక్ష విధానం ద్వారా 50 మార్కులకు నిర్వహించబడును, సమాన మార్కులు వచ్చిన విద్యార్థులకు భక్తుల సమక్షంలో లక్కీ డ్రామా ద్వారా విజేతలను ఎంపిక చేయబడును, బహుమతులు: ప్రథమ బహుమతి 5000 రూపాయలు, ద్వితీయ బహుమతి 2500, తృతీయ బహుమతి వెయ్యి రూపాయలు, 6 ప్రోత్సాహక బహుమతులు భక్తులందరూ సమక్షమున విజేతలకు బహుమతులు ఇవ్వబడును, ఈ కార్యక్రమంలో ప్రతి రోజు విద్యార్థులకు స్నాక్స్ ప్రసాదము తోపాటు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఒక ఆధ్యాత్మిక కానుక మరియు కోర్స్ కంప్లీటెడ్ సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షాత్ నారాయణ దాస్, పాశం అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

విధులకు వెలుతుండగా ప్రమాదం

**రాజంపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త**
విధి వెంటాడింది. విధులకు వెళుతుండగా మృత్యువు కాటేసింది. మోటర్ బైక్ డివైడర్ను ఢీకొనడంతో కానిస్టేబుల్ మరణించిన విషాద సంఘటన సోమవారం ఉదయం పోలి చెరువు కట్టపై జరిగింది. రాజంపేట పట్టణంలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ కే. సుధాకర్ రాజు చిట్వేల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్నారు. ఉదయం ఇంటికి బయలు దేరారు. బయలుదేరిన పది నిమిషాలకి పోల్చరు కట్టపై ప్రమాదవశాత్తు డివైడర్లు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సుధాకర్ రాజు(56) మృతి చెందారు. రాజంపేట అర్బన్, మన్నూరు పోలీస్ స్టేషన్ లో కూడా పనిచేసిన సుధాకర్ మరణ వార్త విని సహచరులు, స్నేహితులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. పోలీస్ అధికారులు కూడా సుధాకర్ రాజు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం నివాసానికి మృతదేహాన్ని తరలించారు.



## చంద్రబాబు 76వ జన్మదిన వేడుకలు




**మైదుకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను జరపాలని ఆదేశించిన ప్రధాన నాయకులు, అనుచరుల సందడి, కార్యక్రమాలు కనిపించలేదు,కొందరి నాయకులతో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపి రవీంద్ర,టీడీపీ జిల్లా కార్యదర్శి ఉప్పుగుంటపల్లి కిషోర్, మైదుకూరు మండల అధ్యక్షుడు భీమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆకుల కృష్ణయ్య,సంజీవ రెడ్డి, టీడీపీ నాయకులు బి.ఎన్.శ్రీను,ధనపాల రవి, పాలమాబు, రాధాకృష్ణ, అక్బర్, శంకర్ రెడ్డి, గుండంరాజు సుబ్బయ్య, జయభరత్ రెడ్డి, శీర్ల నాగ మోహన్, లక్ష్మీనారాయణ రెడ్డి, బండి అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



**ముద్దనూరు,ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**
తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు 76 పుట్టినరోజు సందర్భంగా మండలంలోని టిడిపి కార్యకర్తల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బిరామిరెడ్డి హాజరై కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో టిడిపిపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న మహానేత అని కొనియాడారు.

## వేతన బిల్లుల ప్రక్రియకు

# అడ్డంకులు తొలగించాలి

**ఎడ్యుకేషన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**
ఏప్రిల్ నెలలో సమర్పించవలసిన రెగ్యులర్ పే బిల్లులకు ఉన్న ఆటంకాలను తొలగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం సాయంత్రం కడప కలెక్టరేట్ లోని జిల్లా ఉపఖజానా శాఖ అధికారి వెంకటేశ్వర్లను కలిసి వినతి పత్రం సమర్పించారు. నిధి వెబ్సైట్లో ఏప్రిల్ నెలకి సంబంధించిన జీతాల బిల్లులు సమర్పిస్తున్న సమయంలో కరెంటు బిల్లుల సమాచారము మరియు ఆర్టిఐ సమాచారము పొందుపరిస్తేనే జీతాల బిల్లులు ఓపెన్ అవుతాయని నిబంధనను తెలియజేయడం వల్ల చాలా మంది డిడిఓ ల దగ్గర ఈ సమాచారం లేకపోవడం చేత ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే కొంతమంది ప్రధానోపాధ్యాయుల పరిధిలోని కరెంటు బిల్లుల నెంబర్లు ఎంఈఓ లాగిన్ కు లింకు చేయబడ్డాయని వాటిని తొలగించడం టెక్నికల్ గా ఇబ్బందిగా మారిందని అందువల్ల అటు ఎంఈఓలు ఇటు ప్రధానోపాధ్యాయులు ఇరువురు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహమ్మద్, గోపీనాథ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు బత్తుల చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహా పూజ పంచామృత అభిషేక ఆహ్వానం

**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 20 ప్రభాతవార్త**
శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మహా పూజ మరియు కళ్యాణ మహోత్సవంను అంగరంగ వైభవంగా జరుగునని బ్రహ్మం గారి దీక్ష పరులు పేర్కొన్నారు. ఈ మహోత్సవానికి మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి, మరియు శ్రీ శివ కుమార స్వాముల పాల్గొంటారని, 22 వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు మహాపూజ, కళ్యాణ మహోత్సవం జరుగును. భక్తులు బ్రహ్మం గారి దీక్ష పరులు హాజరు కావాలని అన్నారు. 12 గంటల 30 నిమిషాల అన్నదాన సత్రంలో అందరికీ అన్నదానం జరుగును. ఆరోజు రాత్రి 8 గంటల నుండి శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మరియు జగన్మాత శ్రీ ఈశ్వరి దేవి గ్రామోత్సవం కలదు.బ్రహ్మంగారి దీక్షపరులకు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరుగుతుంది.



## పిల్లలపై పిచ్చికుక్క దాడి...

**ముద్దనూరు,ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని యామవరం గ్రామంలో ఆదివారం రాత్రి ఐదు సంవత్సరాల బాలుడు తన్విక్, మరో ఇద్దరు పిల్లలపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు గ్రామంలో వీధి కుక్కలు స్వైరా విహారం చేస్తూ ఒంటరిగా వెళుతున్న మహిళలను ద్విచక్ర వాహనదారులపై వెంటపడుతూ గాయపరచడం వంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించి వీధి కుక్కలను కట్టడి చేయాలని గ్రామస్తులు కోరారు. పట్టణం గ్రామాలు అని తేడా లేకుండా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడులు చేస్తూనే ఉన్నాయని అధికారులు పరిశీలించి వీధి కుక్కల వలన సమస్యలు తలెత్తకుండా అధికారుల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## బాలింతలకు ఆహార నియమాలలో పలు సూచనలు



**మైదుకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సీడీపీఓ వారి ఆధ్వర్యంలో 8వ పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సచివాలయం ఏఎన్ఎం గర్భవతులకు, బాలింతలకు ఆహార నియమాలు పాటించే విషయంలో పలు సూచనలు ఇవ్వడం జరిగింది. గర్భిణీలు మూడు పూటలు మాత్రమే ఆహారం తీసుకోవడం మాత్రమే చిన్న చిన్న బాగాలుగా ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వలన గ్యాస్ట్రిక్ సమస్యలు, పోషకాహార లోపం లేకుండా నివారించగలమని తెలిపారు. అదే విధంగా వడ దెబ్బ తగలకుండా నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పిల్లలకు పాలు ఇచ్చేటప్పుడు వారితో మాట్లాడుతూ పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు తల్లికి ఉన్న అనుబంధం మరింత బలంగా తయారవ్వడం మాత్రమే కాకుండా పిల్లలకు పాలు కూడా బాగా వంటబడతాయి తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. అదే విధంగా పిల్లలకు జంక్ ఫుడ్, టీవీ లు, సెల్ ఫోన్లు దూరంగా ఉంచి పౌష్టికాహారంతో, ఆటపాటలతో పిల్లలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, సీడీపీఓ ఎస్.శ్రీదేవి, సూపర్వైజర్స్ జె ప్రశాంతి, జె శ్రీదేవి, సచివాలయం అడ్మిన్ రామ లక్ష్మి, సచివాలయం ఏఎన్ఎం బేబీ షాలిని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

**నందలూరు, ఏప్రిల్ 20 ప్రభాత వార్త :**
చంద్రబాబు 76వ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ, ఆయన దీర్ఘాయుష్షు కలగాలని కోరుకున్నారు.



# క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నతస్థానం

**బద్వేలు అర్బన్ ఏప్రిల్ 20 ప్రభాత వార్త :**

ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని రాజుపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.ఎల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం బద్వేల్ మండల పరిధిలోని రాజుపాళెం ఉన్నత పాఠశాల నందు పాఠశాల వార్షికోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టాలని, చదువుతోనే ఏదైనా సాధించవచ్చని, మనిషి మనుగడకు చదువు, సంస్కారం ఎంతో అవసరమని సూచించారు. విద్యార్థులు వేసవి సెలవులలో సమయాన్ని వ్యర్థం చేయకుండా చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఒక సైనికుడికి ఆయుధం ఎంత అవసరమో ప్రతి విద్యార్థికి అభ్యసన అనేది అంతే అవసరమని, అభ్యసన ద్వారానే విద్యార్థి ఆయుధం అనే జ్ఞానం, శక్తిని సంపాదిస్తారని పేర్కొన్నారు. అభ్యసన ద్వారానే మానసిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. తద్వారానే జీవితంలో విజయం సునాయసమవుతుందని పేర్కొన్నారు. తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అందుకు తగ్గట్టుగానే తన ఆలోచన, తపన, కృషి, పట్టుదల ఉండాలన్నారు. విద్యార్థుల అభ్యసన ఎంత బలంగా ఉంటే అంత ఎక్కువ ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. నేటి కాలంలో అవసరానికి మించి వాడుతున్న పరికరం మొబైల్ ఫోన్ అని, ఇది సమయాన్ని వృధా చేయడమే కాకుండా, చదువుపై ఏకాగ్రత లేకుండా చేస్తుందని, మెదడుపై, కంటి చూపుపై ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే లభిస్తుందని,



కార్పొరేట్ మాయాజాలంలో పడి ప్రభుత్వ విద్యా రంగం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు నిర్లక్ష్యం చూపకూడదన్నారు. విద్యార్థి సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడేది ప్రభుత్వ పాఠశాలలేనని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను నిర్లక్ష్యం చేస్తే, ఊరి బడి కనుమరుగవుతుందని, తద్వారా పేదలకు విద్య దూరమవుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బడులలోనే తమ పిల్లలను చేర్పించి ఊరి బడిని రక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.బాల ఓబన్న, జి.ఆంథోని రావు, పట్టెం వెంకటసుబ్బారెడ్డి, శ్రీకాంత్, సరస్వతి, బి.థామస్, ఎన్.శ్రీధర్ రెడ్డి, ఎల్.వెంకట రెడ్డి, విద్యా కమిటీ చైర్మెన్ కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు సోమవారంతో అత్యంత ఘనంగా ముగిశాయి. అగ్నిమాపక ఆఫీసర్ చంద్రుడు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా బద్వేల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, అపార్ట్మెంట్, పెట్రోల్ బంక్, తెలుగంగ కాలనీ మరియు ప్రభుత్వ హాస్పిటల్, బాలుర ఉన్నత పాఠశాల అగ్నిమాపక కేంద్రంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు, ఈ ముగింపు కార్యక్రమానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలను కొనియాడారు."వైద్యులు ఆసుపత్రిలో ప్రాణాలు కాపాడితే, అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి ప్రమాదాల్లో ఉన్నవారిని కాపాడతారన్నారు, సమాజంలో వీరి సేవలు అత్యంత కీలకమైనవి. అప్రమత్తత: విపత్తు సమయాల్లో క్షణాల్లో స్పందించి, ఆస్తి నష్టాన్ని, ప్రాణ నష్టాన్ని నివారించడంలో వీరి పాత్ర అద్భుతమని కొనియాడారు. వారం రోజుల పాటు ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం సంతోషకరమని, ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండనక, వాననక 24 గంటలు విధి నిర్వహణలో ఉంటూ ప్రజా రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది చేసిన మాక్ డ్రిల్ (ప్రమాద ని



వారణ ప్రదర్శనలు) అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో చుట్టుపక్కన ప్రజలకు నాగభూషణం డిగ్రీ కళాశాల ఎన్సిసి స్టూడెంట్స్ తో సమావేశం నిర్వహించి అగ్ని ప్రమాదాల పరికరాల గురించి అగ్నిమాపక సేవలు గురించి అవగాహన కల్పించి అగ్ని ప్రమాదాలు కరపత్రాలను వారికి అందజేశారు, ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చెన్నయ్య ప్రభాకర్ రావు బాబు రెడ్డి శ్రీనివాసులు పాములేటి నాయక్ బాలయ్య రాజు రాజశేఖర్ మరియు స్థానిక ప్రజలు పలువురు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ పున ప్రారంభించిన ఎమ్మెల్యే వరద

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సోమవారం స్థానిక శివాలయం సర్కిల్ లోని వైసీపి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించకుండా నిలిచిపోయిన పురపాలక మార్కెట్ నూతన కాంప్లెక్స్ నిర్మాణ పనులను భూమిపూజ చేసి పునః ప్రారంభించారు. పురపాలక కమీషనరు రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా టిడిపి నాయకులు నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి కేవలం శిలాఫలకాలకే పరిమితమైందని, గతంలో కానీ, ప్రస్తుతం కానీ టిడిపి ప్రభుత్వమే అని వివరించారు. అనంతరం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నవరత్నాల పేరుతో అప్పులాంధ్ర ప్రదేశ్ గా మారిస్తే కూటమి పాలనలో సంక్షేమాంధ్ర ప్రదేశ్ గా మారిందని వివరించారు. కేవలం కుట్రపరితంగా చంద్రబాబు ను జగన్ జైలుకు పంపారన్నారు. అనంతరం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ తాను నిరంతరం ప్రజాసేవలో వుంటూ అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ ఆధునీకరణ 51 కోట్ల రూపాయల కు చేరిందని, కానీ తాను గతంలో 3 కోట్ల రూపాయలకే ప్రతిపాదనలు పంపితే దాన్ని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, తదితరులు అడ్డుకొని, ప్రస్తుతం వారు కొంత వెనకేసుకున్నారని విమర్శించారు. ప్రజలు ఎవరు అభివృద్ధి చేస్తున్నారో గమనించి ఓట్లేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ యంపిపి నంద్యాల రాఘవరెడ్డి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వియస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, రాజుపాలెం మండల మాజీ జెడ్పిటిసి తోట మహేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పేట చంద్ర, నల్లబోతుల నాగరాజు, శ్రీనివాస్ ఆచారి, టిడిపి పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, రాజుపాలెం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జబిబుల్లా, అధికార ప్రతినిధి ఘంటశాల వెంకటేశ్వర్లు,కార్యదర్శి తలారీ పుల్లయ్య, జిల్లా టిఎన్టీయుసి అధ్యక్షుడు కుతుబుద్దీన్,టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, శివాలయం చైర్మన్ వంగల నారాయణరెడ్డి, డిడబ్ల్యూసి చైర్మన్లు సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, యువ నాయకుడు బచ్చల వీరప్రతాప్, కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి,లకూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## పోరుమామిళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కృత్రిమ కొరత: ఎమ్మార్వోకు సిపిఎం వినతి



**పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 20 ప్రభాత వార్త:**

పోరుమామిళ్ల మండలంలోని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపిస్తూ సిపిఎం మండల కమిటీ ఆదివారం స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసింది. ఉదయం 11 గంటలకు సిపిఎం మండల కార్యదర్శి యన్. భైరవ ప్రసాద్, సిఐటియు మండల కార్యదర్శి సగిలి ప్రకాష్‌ల ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో ఉన్న ఆరు పెట్రోల్ బంకుల్లోనూ 'పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోయాయి' అంటూ బోర్డులు పెట్టడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు."యుద్ధాల కారణంగా నిల్వలు అయిపోయాయని యాజమాన్యాలు సాకులు చెబుతున్నాయి. కానీ కలెక్టర్, ఆర్డీవో ఎక్కడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదని మీడియాకు ప్రకటిస్తున్నారు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోల్ లీటరు రూ.130 వరకు, గ్యాస్ సిలిండర్ రూ.1800 నుంచి రూ.2000 వరకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు" అని భైరవ ప్రసాద్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లగా, తనిఖీలకు కింది స్థాయి అధికారులను పంపిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అంతేకాకుండా, పెట్రోల్ బంకుల్లో మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు కూడా సరిగా లేవని వారు పేర్కొన్నారు.కలెక్టర్, ఆర్డీవో చొరవ తీసుకుని ప్రతి పెట్రోల్ బంకును ఎమ్మార్వోతో తనిఖీ చేయించాలని, కృత్రిమ కొరత సృష్టిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## యువతి మిస్సింగ్ పై కేసు నమోదు..

**ముద్దనూరు,ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన రజిత ఆదివారం రాత్రి ఇంటిలో పడుకొని ఉండగా ఉదయం లేచి చూసేసరికి ఇంటి ఆవరణలో లేకపోవడంతో తల్లిదండ్రులు గ్రామంలో చుట్టుపక్కల, కుటుంబ సభ్యులను విచారించిన ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్లో యువతి తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై మధుసూదన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ యువతిపై ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ



**పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

పోరుమామిళ్ల పట్టణంలోని గిరి నగర్ లో బడి పిలుస్తుంది కార్యక్రమం రెండో రోజు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గిరినగరంలో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు కలిగిన పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే లక్ష్యంతో ఈ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ర్యాలీలో "అందరూ చదవాలి, అందరూ ఎదగాలి" అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి బడి మానేసిన, ఇంకా బడిలో చేరని పిల్లల వివరాలు సేకరించారు. తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని కోరారు.

## కోర్కెలు తీర్చే శ్రీ చ్నుడుపల్లెమ్మ కు పూజలు..

**సుండుపల్లి,ఏప్రిల్ 20,ప్రభాతవార్త:**

మండలపరిధిలోని పీలేరు రోడ్డు పంచాయతీ ఆఫీస్ సమీపంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ చ్నుడుపల్లెమ్మ దేవస్థానంలో స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖ మాసం తృతీయ సోమవారం సందర్భంగా శ్రీ చ్నుడుపల్లెమ్మ దేవతకు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా పాలాభిషేకం, నేయాభిషేకం కార్యక్రమాలు భక్తులు ఘనంగా నిర్వహించారు.

## బిర్రు గుర్రప్పకు సన్మానం

**జమ్మలమడుగు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

ఇటీవల టీడీపీ అధిష్టానం ప్రకటించిన రాష్ట్ర కమిటీలలో జమ్మలమడుగుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బిర్రు గుర్రప్ప అలియాస్ సంతోష్‌కు రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. ఇందులో భాగంగా ఆయనను జమ్మలమడుగు పట్టణంలోని వాటర్ ట్యాంక్ వీధిలో దళిత నాయకులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, రవి, అవిసె శ్రీనివాసులు, పట్నం ఆల్‌ఫ్రెడ్, బిర్రు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 20 ప్రభాతవార్త**



స్వర్ణాంధ్ర నిర్మాణ కర్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు తెలుగు తమ్ముళ్లు టిడిపిపార్టీ కార్యాలయంలో భారీ కేకును కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చెన్ను పల్లె సుబ్బారెడ్డి,ఎంపీపీ వీరనారాయణరెడ్డి,తిప్పన జయ రామానాయుడు,పూజా శివ,సింగిల్ విండో ప్రెసిడెంట్ యల్లటూరు సాంబశివరెడ్డి, టిడిపి వైస్ ప్రెసిడెంట్ శీలం నరసింహ గౌడ్, మేకల సుధాకర్, బోలా శ్రీనివాసులు, లగసాని గంగరాజు,రెడ్ల దిన్నె నాగ ఖాదర్,గంగిరెడ్డిపల్లి సూరి,తెలుగు యువత శ్రీనివాసులు,ఇటుకుల ప్రసాద్ గౌడ్, మరియు తెలుగుదేశం కార్యకర్తలు అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అభాగ్యుడికి చేయూత

**పోరుమామిళ్ళ రూరల్ ,ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**



పోరుమామిళ్ల పట్టణ శివారులోని మలకత్తువ చెక్‌పోస్ట్ వద్ద గత ఐదు రోజులుగా అచేతనంగా పడి ఉన్న ఓ అభాగ్యుడికి వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి ఆశ్రయం కల్పించి మానవత్వం చాటుకున్నారు. సోమవారం స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రామకృష్ణారెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఓబుళాపురం సమీపంలోని తమ సేవాశ్రమానికి తరలించారు. అక్కడ అతనికి క్షౌరం చేయించి, నూతన వస్త్రాలు అందించి ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, బాధితుడు తన పేరు నరేంద్ర అని, స్వస్థలం కడప అని తెలిపాడన్నారు. గత నాలుగేళ్లుగా పోరుమామిళ్ళలోనే రోడ్లపై జీవనం సాగిస్తున్నట్లు నరేంద్ర వెల్లడించినట్లు ఆయన పేర్కొన్నారు.

## వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు..




**యర్రగుంట్ల ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు వేడుకలను సోమవారం యర్రగుంట్ల టిడిపి శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. యర్రగుంట్ల బాలాజీ నిరాశ్రయుల వసతి గృహం నందు వృద్ధులకు, నిరాశ్రయులకు టిడిపి సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**పులివెందుల , ఏప్రిల్ 20 , ప్రభాత వార్త :**

తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నాయుడు అని ఆయన నిండు నూరేళ్ల ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి అన్నారు. సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్నా క్యాంటీన్ వద్ద సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహంగా సాగాయి.ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో బీటెక్ రవి కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్వయంగా పాల్గొని అక్కడికి వచ్చిన పేదలు, సామాన్య ప్రజలకు భోజనం వడ్డించడంతో పాటు స్వయంగా భోజనం చేశారు. ఈ కార్యక్రమంలోహెచ్.ఎల్.సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తొండూరు మండల టీడీపీ పరిశీలకుడు మారెడ్డి భరత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్ల పార్థసారథి రెడ్డి , రాష్ట్ర కమిటీ మెంబర్ మహబూబ్ బాషా , నల్లగారి భాస్కర్ రెడ్డి, పుష్పగిరి గ్యాస్ సంస్థల అధినేత ఓబుల్ రెడ్డి, సమరసింహారెడ్డి ఫెర్టిలైజర్ అధినేత గంగాధర్ రెడ్డి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరద నిజాయితీపరుడైతే సోకాస్ నోటీస్ ఎందుకు ఇస్తారు

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 20 ప్రభాత వార్త**



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్ని రోజుల నుండి విజయమ్మను గౌరవించని లోకేష్, ప్రస్తుతం కేవలం జగన్ కు ఆమెకు మధ్య వున్న అంతరం మరింత పెంచాలని ఈ శుభాకాంక్షల ట్వీట్ చేశారని వివరించారు. కాగా గతంలో విజయమ్మను అవమానించిన వారు, ఆమెను ఏకవచనం తో పిలిచిన వారు నేడు ఇంత గౌరవం చూపడం రాజకీయ దురుద్దేశ్యం కాదా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తల్లికి కానీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తల్లికి కానీ ఎటువంటి జన్మదిన శుభాకాంక్షలు తెలపలేదని గుర్తు చేశారు. జగన్ తల్లిని, చెల్లిని గౌరవించే టిడిపి వారు ఆయన సతీమణి భారతమ్మ ను మాత్రం అక్రమ కేసులో ఇరికించాలని చూడటం సరి కాదన్నారు. అదేవిధంగా నీతి నిజాయితీకి మారు పేరుగా చెప్పుకునే ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కి ఇటీవల అధిష్టానం ఆయన కుమారుని అక్రమాల గురించి, ఆయన కుమారుడు ప్రభుత్వ కార్యకలాపాలలో భాగస్వామ్యం కావడం గురించి, ప్రజా దర్బార్ నిర్వహించకుండా ప్రజా సమస్యలు వదిలేయడం, నిజమైన టిడిపి కార్యకర్తలను విస్మరించడం పై షోకాజ్ నోటీసులు అందిన విషయం వాస్తవమో కాదో ప్రజలకు తెలపాలన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి అటకెక్కిందని విమర్శించారు.

## కారు బోల్తా, ఇద్దరికీ గాయాలు

**దువ్వూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కడప కర్నూలు జాతీయ రహదారిపై గుడిపాడు గ్రామ సమీపంలో కారు బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. హైదరాబాద్ కు చెందిన వ్యక్తులు తిరుమలకు వెళ్లి అక్కడి నుండి తిరిగి వెళుతుండగా గుడిపాడు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శేఖర్ మరొకరికి గాయాలు కాగా దీని వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని దువ్వూరు పోలీసులు పరిశీలించారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**దువ్వూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని తాసిల్దార్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడుతూ సమస్యలను స్పష్టంగా తెలియజేస్తే దానిని పరిష్కరించేందుకు కృషి చేస్తాం అన్నారు. ఎక్కువగా రీ సర్వేలో వచ్చిన పొరపాట్లు అలాగే మోటేషన్ల పైన అవినీతి పత్రాలు వచ్చాయని వాటిని సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, ఎంఈఓ భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఏపీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్డు ఏర్పాటు



**దువ్వూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కడపకర్నూలు జాతీయ రహదారిపై ఇడమడక వద్ద నేషనల్ హైవే అథారిటీ సహకారంతో తాత్కాలిక సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. ఇడమడక వద్ద సర్వీస్ రోడ్డు లేకపోవడంతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండేవని వాటిని గుర్తించి ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకుపోయామన్నారు. అధికారుల సహకారంతో తాత్కాలికంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. ఈ రోడ్డు ద్వారా వాహనదారులు వెళితే ప్రమాదాలు తక్కువగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సర్వీస్ రోడ్డు ఏర్పాటుతో నారాయణ పల్లె, ఇటుకల పాడు, ఇడమడక గ్రామస్తులకు ప్రయోజకరంగా ఉంటుందని, ఈ రోడ్డుని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసినందుకు ఈ మూడు గ్రామాల ప్రజలు పోలీస్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వెయ్యి మందికి పైగా మజ్జిగ వితరణ



**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం మైదుకూరు రోడ్ అన్న క్యాంటీన్ మంచినీటి చలివేంద్రం వద్ద తెలుగుదేశం పార్టీ మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్ రెడ్డి,బోరెడ్డి జగదీశ్వర్ రెడ్డి,అలాగే జోగి రెడ్డి గారి పల్లె కు చెందిన లంకమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బీరం చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో దాదాపు 1,000 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి చేతుల మీదుగా పలువురికి మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించారు అలాగే అనేకమంది బాటసారులకు అన్న క్యాంటీన్లో అన్నదాన కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా పలువురికి వడ్డించారు, అనంతరం ముఖ్యమంత్రి కి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో కె.వి సుబ్బారావు, ముచ్చర్ల ప్రవీణ్ అనిల్ కృష్ణ, జొన్నలగడ్డ సుధాకర్ పెసల సుధాకర్, టిడిపి సీనియర్ నాయకులు రాంతు, మిత్తికాయల రమణ, కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, బిజెపి నాయకులు రామ సుబ్బారెడ్డి, మరియు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వేంపల్లిలో సీఎం జన్మదిన వేడుకలు..

**వేంపల్లి:ఏప్రిల్ 20 ప్రభాతవార్త**



స్థానిక వేంపల్లి లో పులివెందుల రోడ్డులో నిసీనియర్ నాయకులు దేశం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి సోమవారం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా దేశం సీనియర్ నాయకులు దేశం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని మన రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే అది నవ్యాంధ్ర ప్రదేశ్ కావాలంటే చంద్రబాబు తోనే సాధ్యం అని అన్నారు ఈ సందర్భంగా పలువురు దేశం నాయకులు పాల్గొన్నారు.. కార్యక్రమంలో మల్లంగి భాస్కర్ రెడ్డి ఏమి రెడ్డి కృష్ణారెడ్డి పురుషోత్తం రెడ్డి గురువిరెడ్డి రామగంగి రెడ్డి 69 అధినేత గంగాధర్ రెడ్డి పాములూరు రామలింగ రెడ్డి ఐచర్ రమణ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి కమిటీ సభ్యుడుగా మల్లంగి పాపిరెడ్డి

**వేంపల్లి:ఏప్రిల్ 20(ప్రభాత వార్త )**



వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి కమిటి సభ్యుడిగా మల్లంగి పాపిరెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. వేంపల్లె మండలం అయ్యవారిపల్లెకు చెందిన మల్లంగి పాపిరెడ్డి 1992 నుంచి ఇప్పటి వరకు టీడీపీ పార్టీ కోసం కార్యకర్తగా ఉండి పని చేస్తున్నాడు. అయ్యవారిపల్లెలో గ్రామం మొత్తం వైసీపీ పార్టీకి అనుకూలంగా ఉన్నప్పుటికి వారికి లొంగి పోకుండా నిజాయితీతో మల్లంగి పాపిరెడ్డి మాత్రం టిడిపి పార్టీని నమ్ముకొని పని చేయడం జరిగింది. ప్రతి ఎన్నికల్లో ఒక్కడే టిడిపి పార్టీ వైపు ఏజెంట్ గా నిలబడి పోరాటం చేశారు. గత ఎన్నికల్లో కూడ టిడిపి వైపు ఏజెంట్ గా నిలబడి ఎన్నికలు సజావుగా జరిపించాడు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసిన పాపిరెడ్డిని గుర్తించి పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో కూటమి ప్రభుత్వం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యుడిగా నియమించడం జరిగింది. టిడిపి ప్రభుత్వం గుర్తించడం సంతోషకరమని ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యుడు పాపిరెడ్డి తెలిపారు.

## ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు నిర్వహణ

**బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 20, ప్రభాత వార్త**

బద్వేల్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అభిప్రాయపడ్డారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడుతూ, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.

# సమసమాజ స్థాపకులు.. గొప్ప సంఘ సంస్కర్త బసవన్న

## బసవేశ్వరుడి జయంతి వేడుక సభలో ఇంచార్జి డీఆర్వో వెంకటపతి..



**కడప, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**
వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచివేసి, ఒక సమ సమాజాన్ని స్థాపించిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడు (బసవన్న) అని.. ఆధునిక సమాజానికి ఆయన చరితం ఆదర్శనీయం అని ఇంచార్జి డీఆర్వో వెంకటపతి అభివర్ణించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని సభాభవన్ లో యువజన సంక్షేమ శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడి జయంతి వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్వో వెంకటపతి మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా ప్రతి ఏడాది నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఏడాది వైశాఖ మాసం మూడవ రోజును ఆయన జన్మదినంగా చరిత్ర పరిగణించడం జరిగిందని.. ప్రస్తుతం బసవేశ్వరుని జయంతి వేడుకను జరుపుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఆయన చెప్పిన వాక్కులు.. నేటి సమాజానికి ఆదర్శనీయం అన్నారు. హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు (1134-1196) ఒకరని.. సమాజంలో అందరూ సమానమేనని సత్యాన్ని ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే చాటి చెప్పిన సంఘ సంస్కర్త అన్నారు. అందుకే ఆయనను.. బసవన్న, బసవుడు, విశ్వగురు అని పలువురు సామాజిక సంఘ పెద్దలు పిలుస్తారన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడు లింగాయత ధర్మాన్ని స్థాపించారన్నారు. బసవేశ్వరుడు బోధించిన సంప్రదాయమే అనంతర కాలంలో లింగాయత ధర్మం"గా స్థిరపడింది. తెలుగులో సోమనాథుడు బసవపురాణం రాశారని.. శివుడే సర్వేశ్వరుడన్న విశ్వాసంతో శివతత్వ ప్రచారానికి పూనుకున్నారని.. అలా లింగాయత మతానికి బీజాలు వేశారన్నారు. అప్పట్లో ఆడవారికి, దళితులకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు ఉండేవి కావని అలాంటి కాలంలో బసవన్న సమాజంలో అణగరిన వారికి, మహిళలకు అన్ని హక్కులు కల్పించారన్నారు. వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచివేసి, ఒక సమాజాన్ని స్థాపించాడు. మానవతావాది, సంఘ సంస్కర్త అయిన బసవేశ్వరుడు.. కుల, మత వర్ణ, వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. ఆ వ్యవస్థను రూపుమాపడానికి క్రీస్తు శకం 12వ శతాబ్దంలోనే పోరాటాన్ని సలిపిన సాంఘిక విప్లవకారుడు అన్నారు. బూజుపట్టిన మూఢాచారాలకు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగరేసిన మొదటి సంఘ సేవకుడుగా బసవేశ్వరుడు ప్రాచుర్యం పొందారన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామీ, శివరామిరెడ్డి, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్యాలక్ష్మి, డిపివో వెంకట సుబ్బయ్య, టూరిజం అధికారి సురేష్ కుమార్, లింగాయత్ కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు

## 2000 మందికి మహిళలకు చీరలు, 200 మందికి మున్సిపాలిటీ కార్మికులకు వస్త్రాలు వితరణ






**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 20 ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ జన్మదిన వేడుకలను జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు, ఈ వేడుకలు సేవా కార్యక్రమాలతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం మరియు 76 కేజీ కేక్ కటింగ్, చీరలు, వస్త్రాలు పంపిణీ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని దాదాపు 2000 మంది మహిళలకు చీరలు పంపిణీ చేయగా అలాగే మున్సిపాలిటీ కార్మికులకు 204 మందికి వస్త్రాలు అందజేశారు, అలాగే అనంతరం రక్తదాన శిబిరాన్ని డీసీసీ బ్యాంక్ చైర్మన్ ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో దాదాపు 50 మంది పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నాయకుడి పుట్టినరోజున ఆడంబరాలకు పోకుండా, ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ప్రజల క్షేమాన్ని కోరుకునే వ్యక్తి అని, ఆయన స్ఫూర్తితోనే ఈ సేవా కార్యక్రమం చేపట్టామని" తెలిపారు. యువత మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంక్ చైర్మన్ ముఖ్యమంత్రి పాలన మరియు అభివృద్ధిపై ప్రసంగించారు.

**అభివృద్ధికి మారుపేరు:** చంద్రబాబు నాయుడు కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాదు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే ఒక విజనరీ లీడర్ అని కొనియాడారు.

**ఐటి మరియు మౌలిక సదుపాయాలు:** ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ స్థాపన నుంచి, నేటి నవ్యాంధ్ర నిర్మాణంలో ఆయన పోషిస్తున్న పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధిపై ఆయనకు ఉన్న మక్కువను గుర్తు చేస్తూ, కడప జిల్లాకు సాగునీరు మరియు పారిశ్రామిక అభివృద్ధి అందించడంలో ఆయన కృషిని వివరించారు.

**ప్రజా నేత:** 76 ఏళ్ల వయస్సులోనూ యువకుడిలా శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ఆయన నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సీమ్నాక్ ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కడప రిమ్స్ వారిచే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం లో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది అన్నారు, సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, ఊరి బ్నిడి మహేశ్ రెడ్డి, ఆరవ శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, చెరుకూరి రవికుమార్, పంగా శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, జహంగీర్ భాష, పాలకొండు రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ కొంకుల రాంబాబు, మాచుపల్లి కృష్ణారెడ్డి, బీరం జయ రామిరెడ్డి, పబ్బతి శివరామ్, సుబ్బారెడ్డి, కమలాకూరు రామకృష్ణారెడ్డి, మరియు బద్వేల్ నియోజకవర్గస్థాయి టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా ఆరాధన
# గురుపూజా మహోత్సవాలు



**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 20 ప్రభాతవార్త**
ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం, కాలజ్ఞాన ప్రదాత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ప్రధాన మఠం కందిమల్లయపల్లె లోని ఈ ఏడాది ఆరాధన గురుపూజా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు అయ్యాయని మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకట స్వాముల వారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయని మేనేజర్ ఈశ్వరయ్యచారి తెలిపారు. ఈ మహోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 23వ తేదీ నుండి ఏప్రిల్ 28వ తేదీ మంగళవారం వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 26 వ తేదీ ఆదివారం బ్రహ్మం గారు సజీవ సమాధి నిష్ఠ వహించిన వైశాఖ శుద్ధ దశమి పవిత్ర సుదినం, 27 వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు కనుల పండువగా బ్రహ్మ రథోత్సవం, 28 వ తేదీ మంగ్లవారం భక్తులకు మహా ప్రసాద వినియోగం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ప్రతి నెల జరిగే మాస కళ్యాణానికి శాశ్వత ఉభయ దాతలుగా చేరాలనుకునే వారు ఒక లక్ష రూపాయలు చెల్లించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలనివారు కోరారు. ఉత్సవాల సమయంలో భక్తుల కోసం ప్రత్యేకంగా హరికథలు, సంగీత కచేరీలు, వేదాంత ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. మరింత సమాచారం కోసం మఠం ఫోన్ నెం 95029 86023, 9652216023 సంప్రదింగలరు.

# ఆంజనేయ స్వామికి బంగారు తిరునామం

**రాజంపేట, ఏప్రిల్ 20 ప్రభాతవార్త**



రాజంపేట పట్టణం ప్రధాన రహదారిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా 1.5 లక్షలు విలువ చేసే బంగారు తిరునామాన్ని సోమవారం ఉదయం ప్రభుత్వ ఉపాధ్యాయుని జి. సరిత, పెంచలయ్య దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన అక్షయ తృతీయ పండుగ సందర్భంగా వాయు పుత్రుడైన హనుమంతునికి బంగారు తిరునామం అందజేసే భాగ్యం తమకు దక్కడం సంతోషంగా ఉందన్నారు. హనుమంతుడి ఆశీర్వాద బలముతో ఆధ్యాత్మిక సేవ సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రవి స్వామి, పెంచలయ్య దంపతులతో పాటు, కుమార్తెలు శ్రేయా చౌదరి, భవ్య చౌదరి పాల్గొన్నారు.

# మలేరియాను అంతమొందించండి



**బద్వేలు ,ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**
దోమలను అంతమందించినప్పుడే మలేరియా అంత మెందుతుందని, గాంధీ నగర్ వైద్యాధికారి శరత్ చంద్ర అన్నారు. దోమలను నివారించాలంటే లార్వా దశలోనే అరికట్టాలన్నారు. పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు మలేరియా పై రాత పరీక్ష, క్విజ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మరియు మెడికల్ క్యాంపులను నిర్వహించి, వైద్య అధికారి అవసరమైన వారికి ఉచిత మందులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవడం తో పాటు, మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మజీ ,సూపర్వైజర్ శివరామిరెడ్డిలు మాట్లాడుతూ, ఫీవర్ ,లార్వా ప్రతి ఇంటిని దర్శించి సర్వే చేస్తున్నామన్నారు. అవసరం ఉన్న చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు. భవిష్యత్తులో దోమ పుట్టకూడదు, కుట్టకూడదు అనే నినాదం లో పనిచేస్తున్నామన్నారు. డ్రైనేజీ కాలువలో, నీళ్ల నిల్వ ఉన్నచోట్ల అబేట్ ,ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. మలేరియా పరీక్ష ,క్విజ్ లో మంచి మార్కులు సాధించిన మొదటి బహుమతి గీత శ్రీ, రెండవ బహుమతి నీలిమ, మూడవ బహుమతి తేజా నిహారిక, నాలుగో బహుమతి లక్ష్మీ ప్రసన్న లకు వైద్యాధికారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి, సూపర్వైజర్లు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భానుమతి హెల్త్ అసిస్టెంట్ వీర జనార్దన్ రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య, వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యక్షుడుగా తేజేంద్ర

**వేంపల్లె :ఏప్రిల్ 20 ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడలు, విద్యా మండలి సర్వసభ్య సంఘం ఉపాధ్యక్షుడిగా వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న రాచవీటి తేజేంద్ర ఎన్నికయ్యారు. సోమవారం తిరుపతిలో ఏపీ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కడప జిల్లా వేంపల్లి కు చెందిన రాచవీటి తేజేంద్ర ను ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో 2026 27 సంవత్సరానికి సంబంధించి క్రీడలు మరియు విద్య అనుసంధాన వ్యూహాలపై దృష్టి సాధించింది. మండలి లక్ష్యాలలో ముందుకు నడిపించేందుకు కొత్త కార్యనిర్వాహక సభ్యుల ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తాజా క్రీడా విధానం అమలుపై కూడా సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగింది. అలాగే సంఘం అధ్యక్షులుగా మురళి, కార్యదర్శి మనోహర్ రెడ్డి, అన్ని జిల్లాల నుండి సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



# చంద్రన్న 76వ జన్మదిన వేడుకలు

**సుండుపల్లె, ఏప్రిల్ 20,ప్రభాతవార్త :**
కువైట్ (గల్ఫ్ )దేశం నందు ఫరవానియా నగరంలో ద్వైహీ ప్యాలెస్ హోటల్ నందు ముఖ్యమంత్రి చంద్రబాబు 76 వ జన్మదిన వేడుకలను ఏపీ టీడీపీ యూత్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ ఖాన్ (గ్రూప్ సభ్యులు) సుగవాసి యువసేన అధ్యక్షులు కంచన రెడ్డిశేఖర్ నిర్వహించడం జరిగిందని వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు నబీ రసూల్, జిలాన్,అద్దె పల్లి చిన్నారాజు, పద్మ రాజు వేణురాజు,తిరుపతి రాజు,పెద్ద నాగూర్,కిరణ్ కుమార్ నాయుడు, కట్టా నరసింహ నాయుడు, నాని, భాషా, కందల రమేష్, నాగేంద్ర, ఖదురూన్, మందా చలపతి, మల్లికార్జున, చాను, మహబూబ్ బాషా, నాగార్జున, షామీ ర్మో, లాలి తదితరులు పాల్గొని భారీ కేకు కటింగ్ చేసి అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు.



# ప్రభుత్వ పాఠశాలలు... భవిష్యత్తుకు మేలు

**పోరుమామిళ్ల రూరల్,ఏప్రిల్ 20 ప్రభాతవార్త:**



ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తును అందిస్తాయని సిద్దవరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె అంగన్‌వాడీ కార్యకర్త లీలావతితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల వివరాలతో కూడిన కరపత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లోనూ ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రజా దర్బార్‌తో సమస్యలకు పరిష్కారం



**పులివెందుల, ఏప్రిల్ 20, ప్రభాత వార్త :**
ప్రజా దర్బార్ తో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని నలుమూలల నుంచి ప్రజా దర్బార్ కు తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం వారితో నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం బీటెక్ రవి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని బీటెక్ రవి స్వయంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. సమస్యలను శ్రద్ధగా విని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో నమ్మకం పెరిగిందని, తమ సమస్య లకు సరైన స్పందన లభి స్తోందని పలువురు అభిప్రా యం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అన్నా క్యాంటిన్‌లో అన్నదానం



**బద్వేలు ,ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి,జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా రాష్ట్రంలోని అన్న కేంటిన్‌లో ప్రతి పేదవాడికి ఉచితంగా భోజన వసతి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ప్రతి ఒక్క పేదవాడికి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు అన్నారు. ఇలాంటి గొప్ప నాయకుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉంటూ రాష్ట్రాన్ని ముందుకు నడిపించే దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం లో అన్న కేంటిన్ లేకుండా చేశారని ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వెంటనే పేదవాడు పస్తులతో ఉండకూడదనే సంకల్పంతో కడుపునిండా భోజనం పెట్టాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి దిగ్విజయంగా నడిపిస్తుండడంతో పేదవాడి గుండెల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రంతు, ప్రసాద్‌రెడ్డి, బొజ్జా రోశన్న, పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, ఎల్‌ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, ఈగ సుమన్‌రెడ్డి, ఏవోసుదాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐకి స్పందించని ఎంపీడీవో కార్యాలయం

**పులివెందుల, ఏప్రిల్ 20 , ప్రభాతవార్త :**
సమాచారం హక్కు చట్టం (ఆర్టీఐ) కింద సమర్పించిన దరఖాస్తుకు చట్టబద్ధ గడువు ముగిసినా స్పందన రాకపోవడంతో వేముల ఎంపీడీవో కార్యాలయంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఫిబ్రవరి 21న స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి పలు అంశాలపై సమాచారం కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు సమర్పించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు గంగాధర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ మండల అధ్యక్షుడు గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు సమాచారం అందించడం అధికారుల చట్టబద్ధ బాధ్యత అని పేర్కొన్నారు. నిర్ణీత గడువు దాటినా స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సమాచారం ఇవ్వడంలో పారదర్శకత లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని,"సమాచారం ఎందుకు ఇవ్వడం లేదు..? ఏమి దాచిపెడుతున్నారు..?" అంటూ అధికారులను ప్రశ్నించారు. వెంటనే పూర్తి వివరాలు వెల్లడించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

# వైయస్ కుటుంబంతోనే పులివెందుల అభివృద్ధి



**పులివెందుల ఏప్రిల్ 20 ప్రభాత వార్త :**
వైఎస్ కుటుంబ సభ్యులతోనే పులివెందుల అభివృద్ధి సాధ్యమని, చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను కూడా బీటెక్ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని, షర్మిలను రాజకీయపావుగా కూటమి నాయకులు వాడుకుంటు న్నారని వైసీపీ నేతలు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్ , హాల్ గంగాధర్ రెడ్డి, పార్నపల్లి కిషోర్ తదితరులు అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో బీటెక్ రవి చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నాయ కులు తీవ్రంగా ఖండిం చారు. జన్మదిన వేడుకల వంటి సంద ర్భాల్లో రాజకీయ విమర్శలు చేయడం అనేది "నీచ సంస్కృతి"కి నిదర్శనమని పేర్కొన్నారు. పులివెందుల ప్రాంత అభివృద్ధికి సంబంధించి నారా చంద్రబాబు నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ చేసిన కృషి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారని వారు అన్నారు.ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూదం, అక్రమ మైనింగ్, ఇసుక దందాలు పెరిగాయని, ఇవన్నీ కేవలం అక్రమ సంపాదన కోసం జరుగుతున్నాయని ఆరోపించారు.అలాగే, వైఎస్ షర్మిలను రాజకీయంగా వినియోగిస్తూ, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేయిస్తున్నారని విమర్శించారు.మరోవైపు, వైఎస్ అవినాష్ రెడ్డి వ్యక్తిత్వంపై వచ్చిన ఆరోపణలను జిల్లా ప్రజలు తిరస్కరించారని, అందుకే ఆయనకు మూడో సారి ఎంపీగా గెలుపునిచ్చార ని వైసీపీ నేతలు పేర్కొన్నారు. రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ, హైడ్రో ఎనర్జీ ప్రాజెక్టులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభించినవేనని, వాటికి క్రెడిట్‌ను ప్రస్తుత ప్రభుత్వం తీసుకోవడం సరికాదని అన్నారు.ఇంకా, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపి స్తున్న నేపథ్యంలో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, పులివెందుల ప్రాంతానికి తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన పలువురు నాయ కులు, స్థానిక ప్రజాప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు వాసిపై నంద్యాలలో కేసు నమోదు

## 30 గ్రాములు బంగారు ఎత్తుకెళ్లిన వైనం

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కుమార్ అనే వ్యక్తిపై నంద్యాల జిల్లా చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఈ ఏడాది జనవరి 6న పోలీసులు మైనర్ బాలికను బెదిరించి బంగారు ఎత్తుకెళ్లిన విషయంలో కేసు నమోదు చేశారు. ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయం ఆవరణలో టీ దుకాణం నిర్వహిస్తున్న కుమార్ గత ఏడాది నవంబరు 26వ తేదీ ఉదయం 11.30 గంటలకు చాగలమర్రి గ్రామం మల్లేవేముల బస్టాండు వద్ద ఓ మైనర్ బాలికను బెదిరించినట్లు దీనిపై జనవరి 6న ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితుడు కుమార్ మైనర్ బాలిక తన స్నేహితుడు సంతోష్‌తో మాట్లాడుండగా ఫొటోలు తీసి ఆ ఫొటోలను ఆమె తల్లిదండ్రులకు చూపిస్తానని బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులకు చూపించకుండా ఉండడానికి నిందితుడు కుమార్ బాలిక నుంచి రూ.50వేలు డిమాండ్ చేశాడు. బదులుగా ఆమె ఇంట్లో ఉన్న బంగారు వస్తువులను తీసుకురమ్మన్నాడు ఇంట్లోని 30 గ్రాములు బరువున్న బంగారు గొలుసును తీసుకొని నిందితుడికి ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తరువాత ఫిర్యాదిదారురాలు ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసి ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వచ్చింఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగింది.

# పేదల పెన్నిది చంద్రబాబునాయుడు

## : ఎల్‌ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి

**బద్వేలు, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):**



పేదలలో చెరగని ముద్ర వేసుకుని వారి పెన్నిధిగా ప్రతి ఒక్కరి మనసులలో చంద్రబాబునాయుడు ఉన్నారని ఎల్‌ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి అన్నారు. ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈగ కుటుంబ సభ్యులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వెంకటరమనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి పడుతున్న తపన మాటలలో చెప్పలేమని అలాంటి నాయకుడు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గుడిలో పూజలు నిర్వహించి ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇలాంటి నాయకుడు ప్రజలకోసం పడుతున్న కష్టం, భావితరాలకు రాజధాని చూపించాలనే సంకల్పం గొప్పదని కొనియాడారు. రాష్ట్రం విడిపోయినా ధైర్యంగా ముందుకు వెళుతూ కూటమి నాయకులతో చర్చించుకుంటూ రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తున్న గొప్ప వ్యక్తి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు అభివృద్ధి చేయడనే ఊహలకు అందని విదంగా చేస్తూ చూపిస్తూ ప్రతిపక్షానికి నిద్ర లేకుండా చేస్తున్నారని వారు అన్నారు. దేశంలోనే ఇలాంటి గొప్ప నాయకుడిని చూసి ప్రధాని కూడా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారంటే రాజకీయాలలో చంద్రబాబు పాత్ర ఏమిటో అర్థమవుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని కొనియాడారు. చెముడూరు టీడీపీ నాయకులు ఈగ సుబ్బారెడ్డి, సుమన్‌రెడ్డి ల ఆద్వర్యంలో పేదలకు మజ్జిగ పాకెట్లు అందించారు.

# పరికరాల ప్రదర్శనతో అవగాహన కార్యక్రమం

**పులివెందుల, ఏప్రిల్ 20 , ప్రభాత వార్త :**
అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక శాఖలో ఉపయోగించే వివిధ రకాల పరికరాలను కేంద్రం వెలుపల ప్రదర్శనకు ఉంచి, వాటి వినియోగ విధానాన్ని వివరించారు.అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన డ్వాక్రా మహిళలు, పాఠశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, వాటి ప్రధాన కారణాలు ఏమిటి అనే విషయాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. అలాగే చిన్నపాటి అగ్ని ప్రమాదాల నుంచి పెద్ద ప్రమాదాల వరకు వాటిని ఎలా నియంత్రించాలి, ఏ జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై ప్రాక్టికల్ డెమోతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వీధిలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, హెడ్మాస్టర్ ఎం. శంకర్ నాయక్ పాల్గొన్నారు. అలాగే నివేదిత పాఠశాల విద్యార్థులు కూడా చురుకుగా పాల్గొని అగ్నిమాపక పరికరాల వినియోగంపై ఆసక్తి కనబరిచారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యమని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. నేటితో అగ్ని మాపక వారోత్సవాలు ముగుంపు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఆఫీసర్ సునీల్ కుమార్, ఎస్సై రవీందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

